క్లుప్తంగా

పాదయాత్రికులకు సత్కారం



పాదయాత్రికులను సత్కరిస్తున్న మిత్ర బృందం

జహీరాబాడ్: మండల కేంద్రమైన కోహీర్‌లోని భీంనగర్ కాలనీకి చెందిన పలువురు కేతకీ ఆలయం వరకు పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా మిత్రులు సత్కరించారు. ఆదివారం గ్రామం నుంచి చేపట్టిన పాదయాత్ర ఝరాసంగంలోకి శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. తిరుమలేష్, భరత్‌రాజ్, నరేష్, మచ్చేందర్, మోహన్, రాజ్ కుల్‌కర్ణిలు పాదయాత్రను చేపట్టి పూర్తిచేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్, సతీష్‌కుమార్, గొల్ల నర్సింహులు పూల మాలలతో సత్కరించి అభినందించారు.

కూలీలకు అంబలి పంపిణీ

నారాయణఖేడ్: జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖేడ్ మండలం అనంతసాగర్‌లో సోమవారం ఉపాధిహామీ పథకం కూలీలకు అంబలి పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చంద్ ఆదేశాల మేరకు ఫౌండేషన్ బాధ్యులు వేసవిలో కూలీలకు ఉపశమనం కలిగించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పరశురాంరెడ్డి, తుకారాం, శ్రీనివాస్, అవిపవార్, మాణిక్యం, దేవరత్నం, సంజీవ్, అంజయ్య, బాగయ్య, కిష్టయ్య, యోహాన్, రామయ్య పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో మంచు మనోజ్ సందడి

జహీరాబాద్: పట్టణంలో ఆదివారం రాత్రి సినీ నటుడు మంచు మనోజ్ సందడి చేశాడు. శ్రీరామ శోభాయాత్ర కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మంచు మనోజ్‌ను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శోభయాత్రలో పాల్గొన్న వేలాదిమంది రామ భక్తులచేత జైశ్రీరాం అని నినదింపజేసి ఉత్సాహపరిచారు. శ్రీరాముడి సుగుణాల గురించి యువతకు వివరించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. వసుదైక కుటుంబం గొప్పతనం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు పూలసంతోష్ పాల్గొన్నారు.

మొగుడంపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తానని ఆయన పేర్కొన్నారు.

కంది తహసీల్దార్‌గా ఆశాజ్యోతి



ఆశాజ్యోతి

కంది(సంగారెడ్డి): కంది మండల తహసీల్దార్గా ఆశాజ్యోతి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన విజయ లక్ష్మి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

తహసీల్దార్‌గా ఉమాశంకర్ బాధ్యతల స్వీకరణ



ఉమాశంకర్

జోగిపేట(అందోల్): అందోలు తహసీల్దార్‌గా సి.ఉమాశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సిర్గాపూర్ తహసీల్దారుగా పనిచేస్తున్న ఉమాశంకర్‌ను అందోలుకు బదిలీ చేశారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఉమాశంకర్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గుమ్మడిదల తహసీల్దార్‌గా పరమేశం



పరమేశం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల నూతన తహసీల్దార్‌గా పరమేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో ఏవోగా పని చేసిన ఆయన బదిలీ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన భాస్కర్

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండల తహసీల్దార్‌గా సీ. భాస్కర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. దీంతో రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు శాలువాతో సన్మానం చేశారు. డీటీ జుబేర్ అహ్మద్, అసిస్టెంట్లు, కంప్యూటర్, ధరణీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప స్వామి కల్యాణోత్సవం



బోనాలతో వెళుతున్న భక్తులు

మండలంలోని మహమ్మదాపూర్‌లో బీరప్ప స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. మహిళా భక్తులు బోనమెత్తారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి దేవత మూర్తులకు బోనాలు సమర్పించారు. ఊరేగింపు సందర్భంగా పోతురాజులు చేసిన విన్యాసాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

రాయికోడ్(అందోల్):

ఆదాయం ఫుల్.. వసతులు నిల్

వట్‌పల్లి సంతలో వసతులు లేక ఇబ్బందులు

- ఏడాదికి లక్షల్లో ఆదాయం
- వేసవిలో నిలువ నీడలేక అవస్థలు



సౌకర్యాలు లేక ఎండలోనే సాగుతున్న వట్‌పల్లి పశువుల సంత

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి సంత సమస్యలతో సతమతమవుతోంది. ఈ సంతకు ప్రతి ఏటా తైబజార్ వేలం పాట పెరుగుతూ గ్రామ పంచాయతీకి లక్షల్లో ఆదాయం వస్తున్నా.. సంతలో సౌకర్యాలు మాత్రం ఆ స్థాయిలో సమకూరడం లేదు. పంచాయతీ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో క్రయ విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వారాంతపు సంతలో పశువులు, మేకలు, కూరగాయలతో పాటు ఇతర వ్యాపారాలు ఎక్కువగా జరుగుతాయి. సంత ద్వారా గ్రామ పంచాయతీకి ఏడాదికి కనీసం రూ.11 లక్షల మేర ఆదాయం వస్తున్నా సమస్యలు మాత్రం ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. పశువులకు దాహం తీర్చేందుకు నీటి తొట్లు లేకపోగా, క్రయ విక్రయదారులకు తాగేందుకు నీటి సదుపాయం కూడా లేదు. దాహం తీర్చుకోవాలంటే డబ్బులు పెట్టి కొనుక్కొని తాగాల్సిందే. లేదా హోటల్ యజమానులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కనీస సౌకర్యాలైన తాగునీరు, నీడ, మూత్ర శాలలు లేవని అమ్మకందారులు వాపోతున్నారు. ప్రస్తుతం మాంసం, చేపల విక్రయదారులు రహదారినే అడ్డాగా మార్చుకొని విక్రయాలు నిర్వహిస్తున్నారు.

అక్రమ వసూళ్ల దందా ఆగేనా..?

వేలం పాట ద్వారా దద్వాయి, తైబజారు, పశువుల సంతలకు సంబంధించి వేలం పాట ద్వారా కాంట్రాక్టులు దక్కించుకున్నవారు పంచాయతీ నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా ప్రతి ఏటా తైబజారు పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయమై ప్రతి ఏటా క్రయ విక్రయదారులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో అధిక వసూళ్ల పర్వం కొనసాగుతూ వస్తునే ఉందనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు సదురు గ్రామ పంచాయతీ అధికారుల అండదండలతోనే కాంట్రాక్టర్లు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు ఈ ఏడాది అధిక వసూళ్లకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలని క్రయవిక్రయదారులు కోరుతున్నారు.

రూ. 10.07 లక్షల ఆదాయం

ప్రతి శుక్రవారం జరిగే ఈ వారంతపు సంతలో పశువులు, గొర్రెలు, మేకలతో పాటు కూరగాయల సంత నిర్వహిస్తుంటారు. ఇటీవల సంతకు వేలం నిర్వహించారు. కాంట్రాక్టర్లు పశువుల సంతకు రూ.6.36 లక్షలకు, తైబజారును రూ.4.05 లక్షలకు, దద్వాయికాంట రూ.38 వేలకు సొంతం చేసుకున్నారు. సంతల వేలం ద్వారా గ్రామ పంచాయతీకి రూ.10.79 లక్షల ఆదాయం సమకూరింది.

విద్యార్థులకు 'అపార్' కార్డుల పంపిణీ



విద్యార్థులకు అపార్ కార్డులను పంపిణీ చేసిన రామకృష్ణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం హెచ్ఎం రామకృష్ణ అపార్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా 'ఒక దేశం ఒక విద్యార్థి ఐడీ' నినాదంలో అపార్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అపార్ కార్డు విద్యార్థులకు భవిష్యత్తులో కీలకంగా మారనుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవనీత, సునీత పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీసీతారామ కల్యాణోత్సవం



శ్రీరామ కళామందిరంలో సీతారాముల కల్యాణం దృశ్యం



హనుమత్ వాహనంపై రాములోరిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



జహీరాబాద్: జహీరాబాద్‌లోని రామాలయంలో సీతారామ కల్యాణం అనంతరం ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు

జిల్లాలోని ఆయా రామాలయాల్లో శ్రీసీతారామ కల్యాణ మహోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామనామ స్మరణతో దేవాలయాల పరిసరాలు మార్మోగాయి. క్తులు ఒడిబియ్యం పోసే తంతును నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా భోజయ్య



నూతన పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. డివిజన్ కేంద్రంలోని సంఘం భవనంలో సోమవారం నూతన అధ్యక్షుడిగా నాయికోటి భోజయ్య, నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన కార్యదర్శిగా రమేష్ కుమార్, ముఖ్య సలహాదారుడిగా నర్ర భిక్షపతి, గౌరవ సలహాదారులుగా శంకర్, పెంటయ్య, కోశాధికారిగా మహేందర్, సహాయ కోశాధికారిగా మేకల శివకుమార్ ఉపాధ్యక్షులుగా జీతయ్య, యాదయ్య, నర్ర రామారావు, అశోక్ , గాదే సుధాకర్, యంజాల మల్లేష్ కార్యదర్శులుగా కొడకంచి భార్గవ్, మేకల జగదీష్ ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, సంఘం కొత్త పాలక మండలిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్, ఎట్టయ్య, టప్పా కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



యూకేజీ విద్యార్థులు పట్టాలు అందుకున్న దృశ్యం

జోగిపేట(అందోల్): జోగిపేటలోని సెయింట్ డాన్ బాస్కో హైస్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫాదర్ ఫోర్లన్స్, ప్రిన్సిపాల్ ఫాదర్ రూఫస్ హాజరై విద్యార్థులకు పట్టాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలు, క్రమ శిక్షణ, శ్రద్ధ వంటి లక్షణాలను నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఫాదర్ నరేష్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ అమల, బీనా, ప్రభిత, హారిక పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ మార్ట్‌లో తనిఖీలు

నారాయణఖేడ్: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ మార్ట్‌లో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి శ్రీశిక సోమవారం నాణ్యతా ప్రమాణాల గూర్చి తనిఖీలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం ఓ వినియోగదారుడికి ఇడ్లీ రవ్వ కొనుగోలు చేయగా పురుగులు వచ్చాయని అధికారులకు ఫిర్యాదులు చేయగా ఆమె సోమవారం మార్ట్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మార్ట్‌లో పలు ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించి తీసుకెళ్లారు. నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మద్దికుంటలో రూ 22.50 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకుంటున్నారని, రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి,మాజీ పీఏసీఎస్ చైర్మెన్ ఆశిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల అరెస్ట్

వట్‌పల్లి(అందోల్): ఎస్టీ కార్పొరేషన్ బకాయిలను వెంటనే చెల్లించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం గిరిజన నాయకులను వట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008 నుండి 2025 వరకు పెండింగ్‌లో ఉన్న ఎస్టీ కార్పొరేషన్ రూ.200 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బంజార భేరిరి మండల అధ్యక్షుడు సుభాష్‌నాయక్, మాజీ సర్పంచ్ దీప్లానాయక్‌లు పాల్గొన్నారు.

అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు

గ్రంథాలయ చైర్మన్ అంజయ్య

ఝరాసంగం(జహీరాబాద్): పోటీ పరీక్షలకు అవసరమయ్యే పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ చైర్మన్ గొల్ల అంజయ్య నిర్వాహకులకు సూచించారు. సోమవారం ఝరాసంగంలోని గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామస్తులు తమ గ్రామంలో గ్రంథాయ ఏర్పాటుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజ్‌కుమార్ స్వామి, మల్లికార్జున్ పాటిల్, రాఘవేంద్ర, అడివన్న పాల్గొన్నారు.



అంజయ్యకు వినతి పత్రం అందిస్తున్న కుప్పానగర్ గ్రామస్తులు

సంక్షిప్త వార్తలు

◆ పాదయాత్రను విజయవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్పొరేటర్ ఎన్నికల సమయంలో మొక్కుకున్న మొక్కును తీర్చుకునేందుకు బుధవారం రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు మండలం గణేష్ గడ్డ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్ రెడ్డి తెలిపారు. అక్కడ జరిగే పూజ కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

◆ వైభవంగా శివపార్వతుల కల్యాణం



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నందికంది రామలింగేశ్వర ఆలయంలో సోమవారం శివ పార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, నాయకులు సాయినాథ్, విజయ్ భాస్కర్ రెడ్డి, చింటూ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ చంద్రమౌళీశ్వరుడికి మహాభిషేకం



నారాయణఖేడ్: పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా సమీపంలోని భక్తమార్కండేయస్వామి ఆలయంలోని చంద్రమౌళీశ్వరుడికి సోమవారం ప్రత్యేక అభిషేకం, మహాభిషేకం, మహాహారతి, ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు కృష్ణ స్వామి ఆధ్వర్యంలో మహిళలు పుష్పార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు రూప శ్రీనివాస్, ఉద్గిరి సావిత్రి భాస్కర్ అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

◆ శ్రీజోగినాథ రథోత్సవానికి విరాళం

జోగిపేట(అందోల్): జోగిపేటలోని శ్రీ జోగినాథ రథోత్సవ ఉత్సవాలకు మంత్రి దామోదర రాజనర్సింహ రూ.5 లక్షల విరాళాన్ని రథోత్సవ కమిటీకి అందజేశారు. ఇందుకుగాను కమిటీ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

◆ శివలింగానికి ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శివలింగానికి ఆలయ పూజారి అయప్పస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మండలంలోని బుదేరా చౌరస్తా సమీపంలోని గుట్టపై వెలసిన మల్లికార్జునస్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలు చేశారు.

రాజ్యాంగాన్ని రక్షించడం ప్రతి పౌరుడి హక్కు

మాజీ మంత్రి చంద్రశేఖర్



రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో చంద్రశేఖర్

న్యాల్‌కల్(జహీరాబాద్): భారత రాజ్యాంగాన్ని రక్షించడం ప్రతి దేశ పౌరుని హక్కు అని మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని ముంగి గ్రామంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ నిరంతర పోరాటం ఫలితమే నేటి భారత రాజ్యాంగం అన్నారు. అలాంటి మహనీయుని పార్లమెంట్ సాక్షిగా అవమానిస్తూ కేంద్ర హోమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుం, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, యువజన కాంగ్రెస్ నాయకులు జీవన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో ప్రయోజనం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో చాట్లపల్లి, మునిగడప గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసం పోవద్దన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కిరణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ప్రతినిధులు నరేష్, బాలలక్ష్మి, సీసీలు బాబు, అనురాధ, చంద్రకళ, రమేష్‌రెడ్డి, రవి, దేవరాజ్, రేణుక, ఏఈఓలు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించాలని కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయుడు పవన్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాచ్నూర్ శివారులోని కేంద్రీయ విద్యాలయంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, పరిశుభ్రత, శుభ్రమైన నీరు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఫోటోరైటప్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

జిన్నారం (పటాన్‌చెరు): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని మండల వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తల్లీబిడ్డ క్షేమం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఎంపీహెచ్ఈఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్ లక్ష్మి, కుమారి, వసంత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.